ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

తూర్పుగోదావరి
16
గురువారం 15 ఆగస్టు 2019



# స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల అభివృద్ధి

## విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

## జేఎన్టీయూకేలో భవనాల ప్రారంభోత్సవం



జేఎన్టీయూకేలో మహిళా హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**జేఎన్టీయూకే, అగస్టు 14:** ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో స్కిల్‌డెవలప్‌మెంట్ కేంద్రాలను అభివృద్ధిపరిచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడానికి ప్రభుత్వం కృషిచేస్తోందని విద్యాశాఖమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. బుధవారం కాకినాడ జేఎన్టీయూకేను విద్యాశాఖమంత్రి సందర్శించారు. ఈసందర్భంగా మొదట ప్రాంగణంలోని దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వర్శిటీలో రూ.22 కోట్లతో నిర్మించిన నివేదిత, నాగావళి, నటరాజ వసతిగృహాల్లోని మొదటి, రెండో అంతస్తులను, ఇన్నోవేషన్ రీసెర్చ్ సెంటర్ ల్యాబ్‌లను మంత్రి ప్రారంభించారు. స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్, సీమెన్స్ సెంటర్ వర్క్‌షాప్‌ను సందర్శించి వాటిపనితీరు గురించి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మేనిఫెస్టో ప్రకారం అన్నిహామీలను నెరవేరుస్తామన్నారు. ప్రధానంగా వృత్తివిద్యా నైపుణ్యకేంద్రాలను, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను స్థాపించి నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు, శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జేఎన్టీయూకే మిగతా కళాశాలలకు మార్గదర్శకంగా ఉండాలని పరిశోధనా అభివృద్ధి విభాగం విద్యార్థులకు శిక్షణనిచ్చి నాయకత్వలక్షణాలను పెంపొందించాలని సూచించారు. ఇన్నోవేటివ్ కేంద్రాల ద్వారా పరిశోధనను ప్రోత్సహించాలని, పరిశ్రమలతో అనుసంధానమై సమస్యలకు పరిష్కారమార్గాలను కనుగొనాలన్నారు. విశ్వవిద్యాలయాలు న్యాక్, ఎన్‌బీఏ గుర్తింపు తప్పకుండా పొందాలన్నారు. జేఎన్టీయూకే, ఆంధ్రా, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్‌లో ముందుండాలని సూచించారు. విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ ఉద్యోగాల ఖాళీలను అవసరం మేరకు భర్తీచేస్తామన్నారు. ఒప్పంద అధ్యాపకుల సమస్యల పరిష్కారానికై కమిటీ వేశామని నివేదిక అందిన వెంటనే సీఎం చర్యలు తీసుకుంటారన్నారు. రెగ్యులేటరీ మానిటరింగ్ కమిషన్ కళాశాలలను పర్యవేక్షిస్తూ ఫీజులను నియంత్రిస్తుందని, ఇదంతా ఒక విశ్రాంత న్యాయమూర్తి ఆధ్వర్యంలో పనిచేస్తుందన్నారు. నరసారావుపేట జేఎన్టీయూలో త్వరలో నిర్మాణాలు చేపడతామని, జేఎన్టీయూకే బీ+గ్రేడ్ నుంచి ఏ+గ్రేడ్ పొందేలా కృషిచేయాలన్నారు. ఎంహెచ్ఆర్డీ నుంచి రూసా నిధులు రాబట్టడానికి ప్రయత్నిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మంత్రి ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్రసాంఘిక సంక్షేమశాఖామంత్రి పినిపే విశ్వరూప్, కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాధ్, తుని ఎమ్మెల్యే దాడిశెట్టి రాజా, ఎమ్మెల్సీలు రామసూర్యారావు, ఐవీ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, కలెక్టర్ మురళీధర్‌రెడ్డి, జేఎన్టీయూకే వీసీ ప్రొఫెసర్ ఎం.రామలింగరాజు, రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

# విలువలతో కూడిన విద్య నేర్చుకోవాలి

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సురేష్

**జేఎన్టీయూకే, ఆగస్టు 14:** విద్యార్థులు విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలని రాష్ట్ర విద్యాశాఖమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సూచించారు. వర్శిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో బుధవారం సాయంత్రం అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులతో నిర్వహించిన ఇంట్రాక్షన్ కార్యక్రమంలో మంత్రి సురేష్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలకు కేవలం విద్యార్థుల వల్లే పేరుప్రఖ్యాతలు లభిస్తాయన్నారు. మౌలిక సదుపాయాలు యూజీసీ, ఎంహెచ్ఆర్డీ ప్రభుత్వం వల్ల లభించవని, విద్యార్థులు ప్రతీ నిమిషాన్ని సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. డబ్బు సంపాదించడమే లక్ష్యం కాకుండా బాధ్యతతో మెలిగి సామాజిక దృక్పథం, పోటీతత్వంతో ముందుకుసాగాలన్నారు. ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యకు ప్రాధాన్యతనిస్తూ రూ.33,000కోట్లు కేటాయించిందని తెలిపారు. విద్యార్థులకు పూర్తి రీయింబర్స్‌మెంట్ ఇవ్వడానికి సంసిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్ వ్యవస్థకు తాము పూర్తిగా విరుద్ధమని, ప్రభుత్వ విద్యాలయాలను బలోపేతంచేసి ప్రాథమికవిద్యను ప్రోత్సహించడానికి ముఖ్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సురేష్

మంత్రి అమ్మఒడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, నవరత్నాలను తప్పకుండా అమలుపరుస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖమంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ వంగా గీతావిశ్వనాద్, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, దాడిశెట్టిరాజా, ఎమ్మెల్సీలు వెంకటేశ్వరరావు, సూర్యారావు, వీసీ రామలింగరాజు, రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావు, ప్రిన్సిపాల్ పి.సుబ్బారావు, రెక్టార్ శాంతిప్రభ, ఓఎస్డీ రవీంద్రనాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.